JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । సోమవారం 29-06-2026
Medchal - Malkajgiri । Monday 29-06-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 28
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 28 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com


# వోకల్ ఫర్ లోకల్ థీమ్ తో ప్రధాని



- చెత్త నుంచి సంపద.. మహిళల అద్భుత కృషి
- జీవి నీటిని పొదుపు చేద్దాం - 'క్యాచ్ ద రెయిన్'

జయభేరి, న్యూఢిల్లీ :

వినాయక చవితి పండుగను పర్యావరణహితంగా, బాధ్యతాయుతంగా జరుపుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో రానున్న వినాయక చవితి సందర్భంగా, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసిన విగ్రహాలను కాకుండా, మన దేశ మట్టితో స్థానిక కుమ్మరులు, కళాకారులు తయారు చేసిన మట్టి విగ్రహాలనే ప్రతిష్టించాలని ఆయన కోరారు. విగ్రహాలు కొనే ముందు అవి దేనితో తయారయ్యాయో, ఎక్కడ తయారయ్యాయో సరిచూసుకోవాలని ప్రధాని ప్రజలకు సూచించారు. మట్టితో చేసిన విగ్రహాలు పండుగ ముగిసిన తర్వాత నీటిలో సహజంగా కలిసిపోతాయని,

...మిగతాది 2 లో



గతంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వకపోగా ప్రజా ప్రభుత్వం లక్షలాది రేషన్ కార్డులు జారీ చేసింది. రాష్ట్రంలో 3.28 కోట్ల మందికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. పేదవారికి ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ. 5 లక్షల చొప్పున అందిస్తున్నాం. భూమి లేని నిరుపేదలను ఆదుకోవడానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. రైతుల సంక్షేమం కోసం 30 నెలల్లో 1.56 లక్షల కోట్లను ఖర్చు చేసింది. 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రికార్డు సృష్టించాం. వందేళ్లుగా అపరిష్కృత ఎస్సీ వర్గీకరణకు శాశ్వత పరిష్కారం చూపించాం. కులగణన చేపట్టాం. 30 నెలల్లో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి యువకుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టాం.

# ఒట్టేసి చెబుతున్నా..
## మూసీ ప్రక్షాళన చేసి తీరుతా
### మూసీ నది ప్రక్షాళన చేయాలన్నది నా కల

జయభేరి, హైదరాబాద్ :

ఎలాంటి ఆటంకాలు ఎదురైనా అధిగమించి మూసీ నది ప్రక్షాళన పూర్తి చేసి తీరుతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. "మూసీ నది ప్రక్షాళన చేయాలన్నది నా కల. ఒట్టేసి చెబుతున్నా మూసీ ప్రక్షాళన చేసి తీరుతా" అని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల నాటికి SLBC ప్రాజెక్టును నూటికి నూరు శాతం పూర్తి చేసి నల్గొండ నేలమీద కృష్ణా నది జలాలను పారిస్తానని ప్రకటించారు. ఎస్ఎల్‌బీసీ పూర్తి చేయడంతో పాటు డిండి ప్రాజెక్టును పూర్తి చేయడానికి సహకారాన్ని అందిస్తానని స్పష్టం చేశారు. నల్గొండ జిల్లా కనగల్ మార్కెట్ యార్డులో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి పైలాన్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి గారు ఆ తర్వాత నల్గొండ పట్టణానికి చేరుకుని తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ TUFIDC ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ. 83 కోట్లతో చేపట్టనున్న తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి

...మిగతాది 2 లో

# జగన్ ఎందుకా ఏడుపులు?



విజయవాడ, జూన్ 28 :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ కిచెన్ల విధానంపై మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. వీటి ఏర్పాటుతో రాష్ట్రంలోని 85 వేల మంది మధ్యాహ్న భోజన కార్మికుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని జగన్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో జగన్ విమర్శలకు మంత్రి నారా లోకేష్ కౌంటరిచ్చారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా ఉన్నవారికి అదనంగా కొత్త ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు నారా లోకేష్ ట్వీట్ చేశారు. ఏపీ ప్రభుత్వం తీసుకువస్తున్న స్మార్ట్ కిచెన్ల విధానంపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన ఆరోపణలను మంత్రి నారా లోకేష్

...మిగతాది 2 లో

# 'ఇడుపు కాయితం'
## అర్థం పవన్ కళ్యాణ్‌ను అడగండి



- కల్వకుంట్ల కవిత

జయభేరి, హైదరాబాద్ :

సోషల్ మీడియాలో ఇటీవలి కాలంలో బాగా చర్చ జరుగుతున్న అంశం ఇడుపు కాయితం. ఈ సినిమా పేరు బయటకు రాగానే దీనర్థం ఏమిటనే ప్రశ్నలు మొదలయ్యాయి. ఆ తర్వాత ఇది కాస్తా ఏపీ, తెలంగాణ నెటిజన్ల మధ్య సోషల్ మీడియా వార్‌కు కారణమైంది. ఈ క్రమంలోనే

...మిగతాది 2 లో



# రైతులు ఈ పంటలు సాగుచేస్తే రైతుభరోసా

- ప్రత్యామ్నాయ పంటలసాగు చేస్తే అదనంగా 8 వేలు
- మంత్రిమండలి సమావేశంలో ఈ నివేదిక పై చర్చ
- వ్యవసాయమే కాదు వీటిని ప్రోత్సహించాలని నిర్ణయం

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలో రైతులకు శుభవార్త. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసి, రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కొత్త సమగ్ర వ్యవసాయ విధానం 2026 నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించింది. ఈ నివేదికలో వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. దీని కోసం స్వచ్ఛందంగా ముందుకొచ్చే రైతులకు ఎకరానికి రూ.4,000 నుంచి రూ.8,000 వరకు

...మిగతాది 2 లో

2 లో

# పుణే హత్య కేసులో క్రికెట్ యాంగిల్

# కుప్పకూలిన హెలికాప్టర్

- 14 మంది దుర్మరణం
- హెలికాప్టర్ సాంకేతిక లోపం వల్ల కూలిందా?



జయభేరి, న్యూఢిల్లీ :

సౌదీ అరేబియాలోని రాస్ తనూరాలో హెలికాప్టర్ కుప్పకూలిన ఘటనలో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. సౌదీ ప్రెస్ ఏజెన్సీ తెలిపిన వివరాల మేరకు.. సౌదీ అరేబియాలోని ప్రముఖ ఆయిల్ కంపెనీ అరామ్‌కోకు చెందిన హెలికాప్టర్ స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటల ప్రాంతంలో రాస్ తనూరా వద్ద కుప్పకూలింది. దీంతో హెలికాప్టర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు మొదలెట్టారు. అయితే, ప్రమాదం కారణంగా అందులో ప్రయాణిస్తున్న 14 మంది చనిపోయారు. ఈ విషయాన్ని మినిస్ట్రీ ఆఫ్ ఎనర్జీ ధ్రువీకరించింది. చనిపోయిన వారంతా సౌదీకి చెందిన వారేనని తెలిపింది. హెలికాప్టర్ సాంకేతిక లోపం వల్ల కూలిందా? లేక ఇతర కారణాలు ఉన్నాయా అనే విషయం ఇంకా తెలియరాలేదు. మినిస్ట్రీ ఆఫ్ ఎనర్జీ ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. కాగా, యూఎస్ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా గత నాలుగు నెలలుగా నిలిచిపోయిన ముడి చమురు రవాణా లోడింగ్‌లను అరామ్‌కో సంస్థ తిరిగి ప్రారంభించిన రెండు రోజుల్లోనే ఈ ప్రమాదం చోటుచేసుకోవడం గమనార్హం.

మొదటిపేజీ తరువాయి

## ఒట్టేసి చెబుతున్నా..

భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌జీ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. నల్గొండ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నివేదించిన ప్రతి పనినీ చేయడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. మూసీ కాలుష్యం కారణంగా ఇబ్రహీంపట్నం, భువనగిరి, మునుగోడు, నల్గొండ ప్రజల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రక్షాళన చేస్తామంటే కొందరు కడుపులో విషయం పెట్టుకుని మాట్లాడుతున్నారు. ఎవరు అడ్డుకున్నా మూసీ ప్రక్షాళన చేసి దేశానికే తలమానికంగా తీర్చిదిద్దుతాం. నల్గొండ జిల్లా ప్రజలకు విముక్తి కల్పిస్తా" అని చెప్పారు. గత 30 నెలల ప్రజా ప్రభుత్వ పాలనలో ఏం సాధించామన్న అంశంలో అసెంబ్లీ వేదికగా చర్చించడానికి సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. తెలంగాణలో పదేండ్లలో వందేళ్ల విధ్వంసం జరిగిందని విమర్శించారు. "గతంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వకపోగా ప్రజా ప్రభుత్వం లక్షలాది రేషన్ కార్డులు జారీ చేసింది. రాష్ట్రంలో 3.28 కోట్ల మందికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. పేదవారికి ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ. 5 లక్షల చొప్పున అందిస్తున్నాం. భూమి లేని నిరుపేదలను ఆదుకోవడానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. రైతుల సంక్షేమం కోసం 30 నెలల్లో 1.56 లక్షల కోట్లను ఖర్చు చేసింది. 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రికార్డు సృష్టించాం. వందేళ్లుగా అపరిష్కృత ఎస్సీ వర్గీకరణకు శాశ్వత పరిష్కారం చూపించాం. కులగణన చేపట్టాం. 30 నెలల్లో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి యువకుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టాం. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇన్ని ఉద్యోగాలు ఇవ్వలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ప్రవేశపెట్టాం. బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్, సాయంత్రం స్నాక్స్ అందించే కార్యక్రమం చేపట్టాం. ఆరుట్లలో తెలంగాణ మోడల్ స్కూల్‌ను అద్భుతంగా తీర్చిదిద్దాం. నాణ్యమైన విద్యను అందించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల నుంచి వందలాది మంది అంబేద్కర్లుగా తయారై రాష్ట్రాన్ని పాలించాలి. పిల్లల్లో నైపుణ్యాలను పెంచాలని స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, ఐటీఐలను ఏటీసీలుగా మార్పు చేశాం" అని ముఖ్యమంత్రి ఒక్కొక్కటిగా సంక్షేమ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. "ఇవన్నీ చేశామంటే.. అది ప్రజా ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత. రికార్డు. ఇవి ప్రజా ప్రభుత్వం సాధించిన విజయాలు కాదా. ప్రజలు ఆలోచన చేయాలి" అని ముఖ్యమంత్రి కోరారు. ఈ సందర్భంగా నీలగిరి జిల్లా మహిళా సమాఖ్య (నల్గొండ) ప్రతినిధులకు ముఖ్యమంత్రి చెక్కులను అందించారు.

## వోకల్ ఫర్ లోకల్ థీమ్ తో ప్రధాని

తద్వారా నదులు, చెరువులు కలుషితం కాకుండా ఉంటాయని మోదీ వివరించారు. మట్టి విగ్రహాలను వాడటం వల్ల మన సంప్రదాయాలను పాటిస్తూనే, ప్రకృతి పట్ల మనకున్న బాధ్యతను నెరవేర్చవచ్చని ఆయన తెలిపారు. అంతే కాకుండా, స్థానిక కళాకారుల వద్ద విగ్రహాలను కొనుగోలు చేయడం ద్వారా 'వోకల్ ఫర్ లోకల్' స్ఫూర్తిని బలపరుస్తామని, ఇది దేశ ప్రయోజనాలకు దోహదపడుతుందని ప్రధాని పేర్కొన్నారు.

చెత్త నుంచి సంపద: మహిళల అద్భుత కృషి

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లా, బియావ్రాకు చెందిన మహిళల కృషని ప్రధాని ప్రత్యేకంగా ప్రశంసించారు. తమ పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను చూసి నిరాశ చెందకుండా, ఆ మహిళలు స్వయంగా రంగంలోకి దిగి ప్లాస్టిక్ వ్యర్థాలను, ఖాళీ బాటిళ్లను సేకరించడం ప్రారంభించారని ఆయన వివరించారు.

ఈ ప్లాస్టిక్‌ను 'ఈకోబ్రిక్స్'గా మార్చి, బహిరంగ ప్రదేశాలను సుందరీకరించడానికి ఉపయోగిస్తున్నారని, గత కొద్ది నెలల్లోనే వందల కిలోల ప్లాస్టిక్ రీసైక్లింగ్ జరిగిందని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. ఒకప్పుడు కాలుష్యానికి కారణమైన ప్లాస్టిక్, నేడు నగర సౌందర్యానికి చిహ్నంగా మారడం ఆ మహిళల కృషికి నిదర్శనమని ప్రధాని కొనియాడారు.

జీవి నీటిని పొదుపు చేద్దాం 'క్యాచ్ ద రెయిన్'

ప్రకృతిని కాపాడుకోవడంలో భాగంగా, కొనసాగుతున్న 'క్యాచ్ ద రెయిన్' ప్రచారంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ప్రధాని పిలుపునిచ్చారు. వర్షపు నీటి ప్రతి చుక్కను వృథా చేయకుండా ఆదా చేయాలని, ఈ ఉద్యమ స్ఫూర్తి ఏమాత్రం తగ్గకూడదని ఆయన స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మోదీ దేశ ప్రజలను కోరారు.

## ఈ పంటలు సాగుచేస్తే రైతుభరోసా

అదనపు నగదు సాయం అందించాలని ప్రతిపాదించారు. జులై 2న జరగబోయే మంత్రిమండలి సమావేశంలో ఈ నివేదికపై చర్చించనున్నారు. రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగినప్పటికీ, ఒకే పంటపై అధికంగా ఆధారపడటం వల్ల నీటి వనరులు, భూమి నాణ్యతపై ఒత్తిడి పెరుగుతోంది. మిగులు ధాన్యం నిల్వలు, నిర్వహణ ఖర్చులు, సహజ వనరుల సమస్యలు తీవ్రమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య నేతృత్వంలోని బృందం జాతీయ, అంతర్జాతీయ అనుభవాలను పరిశీలించి సమగ్ర నివేదిక సిద్ధం చేసింది. నివేదిక ప్రకారం రాబోయే ఐదేళ్లలో 25లక్షల ఎకరాల వరి సాగును దశలవారీగా తగ్గించి ప్రత్యామ్నాయ పంటలకు మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పత్తి, పెసర, వేరుసెనగ, పొద్దుతిరుగుడు, నువ్వులు సాగు చేసే రైతులకు రైతు భరోసా సాయంతో పాటు ఎకరాకు రూ.8,000 అదనపు ఇన్సెంటివ్ ఇవ్వాలని సూచించారు. జొన్న సాగుకు రూ.5,000, మొక్కజొన్న, కంది, మినుము, ఆముదం, సోయాబీన్, శనగ వంటి పంటలకు ఎకరాకు రూ.4,000 చొప్పున సాయం అందించాలని ప్రతిపాదించారు. పంట మార్పిడి మాత్రమే కాకుండా, ఉత్పత్తులకు మంచి మార్కెట్ అవకాశాలు కల్పించాలని నివేదికలో ఉన్నది. పప్పుధాన్యాల మిల్లులు, నూనె గింజల శుద్ధి కేంద్రాలు, నిల్వ సౌకర్యాలు, ప్యాకేజింగ్, బ్రాండింగ్ వంటి వాల్యూ ఎడిషన్ యూనిట్లను ప్రోత్సహించాలి. మహిళా స్వయం సహాయక సంఘాలు, ప్రైవేటు సంస్థలను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని సూచించారు. రైతుల్లో నష్టాల భయాన్ని తొలగించడానికి ప్రభుత్వమే నిధులు సమకూర్చి ప్రత్యేక పంట బీమా పథకం అమలు చేయాలని నివేదికలో పేర్కొన్నారు. ఇది రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపడానికి ఉపయోగపడుతుంది. ఈ కొత్త విధానం అమలైతే రైతుల ఆదాయం పెరిగి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని భావిస్తున్నారు. ప్రభుత్వం ఈ సూచనలను అమలు చేస్తే తెలంగాణ వ్యవసాయ రంగం దిశ మార్చుకుంటుందని రైతు సంఘాలు భావిస్తున్నాయి.

## జగన్ ఎందుకా ఏడుపులు?

ఖండించారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రుచి, శుచి, శుభ్రతతో కూడిన భోజనం పెడుతుంటే జగన్ ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా ఉన్నవారితోపాటు అదనంగా మహిళలు, పేదలకు ప్రభుత్వం ఉపాధి కల్పిస్తుంటే జగన్ ఉసూరుమంటున్నారని మండిపడ్డారు. కడప జిల్లాలో ఐదు స్మార్ట్ కిచెన్లు పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టామన్న మంత్రి నారా లోకేష్.. ఈ పాఠశాలల పరిధిలో పనిచేస్తున్న 233 మంది కుక్‌కమ్‌హెల్పర్లు యథావిధిగా విధుల్లో కొనసాగుతున్నారని స్పష్టం చేశారు. కడప జిల్లాలో మరో 33 స్మార్ట్ కిచెన్లు ఏర్పాటు చేస్తున్నామని.. వీటి పరిధిలోని వారి ఉపాధికి కూడా ఎలంటి ఢోకా లేదని లోకేష్ స్పష్టం చేశారు. స్మార్ట్ కిచెన్ల నిర్వహణ ద్వారా స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు కూడా ఉపాధి దొరుకుతోందని లోకేష్ వివరించారు. ఈ సంఘాలలోని మహిళలలో 38 మందిని హెడ్ కుక్స్, 22 మందిని అసిస్టెంట్ కుక్స్, 256 మంది హెల్పర్లు, 76 మందికి డ్రైవర్లుగా ఉపాధి కల్పించినట్లు తెలిపారు. స్మార్ట్ కిచెన్ల ఏర్పాటు ద్వారా ఇప్పటికే ఉన్నవారితో పాటుగా అదనంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తుంటే జగన్ ఎందుకు ఏడుస్తున్నారని లోకేష్ ప్రశ్నించారు. పేదలు బాగుపడితే జగన్ చూడలేరా అంటూ ట్వీట్ చేశారు. వైఎస్సార్ కడప జిల్లాలో పనిచేస్తున్న మొత్తం 3,450 మంది కుక్ కమ్ హెల్పర్ల వేతనాలను ఏప్రిల్ నెల వరకూ చెల్లించామని.. మే నెలలో స్కూళ్లకు సెలవుల కారణంగా గౌరవ వేతనాలు ఉండవన్నారు. జూన్ నెల ఇంకా పూర్తి కాలేదని..జగన్ ఎవరి బకాయిల గురించి ఆరోపిస్తున్నారో చెప్పాలని నిలదీశారు.

# పుణే హత్య కేసులో క్రికెట్ యాంగిల్

## కొత్త విషయం బయటపెట్టిన సియా సోదరుడు

- పుణే యువ వ్యాపారవేత్త హత్య కేసులో కొనసాగుతోన్న విచారణ
- సియా సోదరుడు సాహిల్‌ను 10 గంటలు విచారించిన పోలీసులు
- క్రికెట్ మ్యాచ్ సందర్భంగా చేతన్‌ను తొలిసారి కలిసినట్టు వెల్లడి



పుణే యువ వ్యాపారి కేతన్ అగర్వాల్ హత్య కేసులో ప్రధాన నిందితులైన సియా గోయల్ , ఆమె ప్రియుడు చేతన్ చౌదరి మధ్య ఉన్న సంబంధంపై దర్యాప్తు లోతుగా సాగుతున్న కొద్దీ.. క్రికెట్ కోణం వెలుగులోకి వచ్చింది. జూన్ 18న లోహగఢ్ కోట వద్ద తన కాబోయే భర్త కేతన్ అగర్వాల్‌ను కొండ అంచు నుంచి తోసేసి చంపినట్లు గోయల్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో సియా సోదరుడు సాహిల్ గోయల్‌ను పోలీసులు శుక్రవారం 10 గంటలకుపైగా విచారించారు. ఈ సందర్భంగా తనకు చౌదరి గురించి తెలుసని వెల్లడించాడు. అయితే, అంతకు ముందు అతడి తల్లిదండ్రులు తమకు సియా, చేతన్ మధ్య సంబంధం గురించి తెలియదని చెప్పడం గమనార్హం. సియా తన క్రికెట్ మ్యాచ్‌లకు హాజరయ్యేదని, అక్కడే తాను మొదటిసారి చేతన్‌ను కలిశానని సాహిల్ గోయల్ పోలీసులకు తెలిపాడు. గతేడాది ఒక కామన్ ఫ్రెండ్ ఇచ్చిన దీపావళి పార్టీలో వారు మళ్లీ కలుసుకున్నారని, అప్పటి నుంచి వారిద్దరూ మరింత సన్నిహితులయ్యారని పోలీసులు వివరించారు. వారిద్దరి మధ్య ఉన్న కాల్ వివరాల రికార్డుల ప్రకారం.. జనవరి నుంచి 2,000కు పైగా ఫోన్ సంభాషణలు జరిపినట్లు వర్గాలు పేర్కొన్నాయి. ఈ కాల్స్ మొత్తం వ్యవధి సుమారు 238 గంటలు ఉంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపాయి.

ఒకవేళ తన సోదరికి పెళ్లి ఇష్టం లేకపోతే, తమ కుటుంబం రద్దు చేసేదని కూడా సాహిల్ గోయల్ పోలీసులకు చెప్పాడు. ఆమె తల్లి పూజా గోయల్.. తన కుమార్తె ఎప్పుడూ కేతన్ విషయంలో అసంతృప్తి వ్యక్తం చేయలేదని, ఆమె చౌదరిని ఎప్పుడూ చూడలేదని లేదా మాట్లాడలేదని చెప్పింది. అయితే, సియా గోయల్ తరఫు లాయర్.. ఆమె, చౌదరి స్నేహితులని అన్నారు. "సాహిల్‌కు చేతన్ చౌదరి తెలుసు.. మేము అతనిడితో కొన్ని విషయాలను సరిచూసుకున్నాం" అని ఒక అధికారి చెప్పినట్లు పీటీఐ వార్తా సంస్థ నివేదించింది. కేతన్ అగర్వాల్ హత్య కేసు దర్యాప్తులో భాగంగా సియా గోయల్ ఇతర బంధువుల నుంచి కూడా వాంగ్మూలాలను నమోదు చేయడానికి పోలీసులు సిద్ధమవుతున్నారు. నిందితుల మొబైల్ ఫోన్‌ల నుంచి వాట్సాప్ చాట్‌లు, ఇన్‌స్టాగ్రామ్ సంభాషణలు, ఇతర డిజిటల్ రికార్డులను తొలగించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. డిలీట్ చేసిన డేటాను తిరిగి సేకరించి ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపనున్నారు. హత్యకు ఒక రోజు ముందు అంటే జూన్ 17న పుణేలోని ఉల్లానగర్‌లోని ఒక కేఫ్‌లో గోయల్, చౌదరి సుమారు గంటసేపు కలుసుకున్నట్లు కూడా దర్యాప్తులో తేలింది. ఈ సమయంలో హత్యకు పథకం రచించారా లేదా దానికి సంబంధించి మరేదైనా చర్చ జరిగిందా? అనే విషయంపై పోలీసులు ఇప్పుడు దర్యాప్తు చేస్తున్నారు. కేతన్ అగర్వాల్, గోయల్‌కు నవంబర్‌లో వివాహం జరగాల్సి ఉంది. కానీ, ఈ పెళ్లి ఇష్టం లేని సియా.. జూన్ 18న అగర్వాల్‌ను లోహగఢ్ కోట వద్దకు తీసుకెళ్లి తన ప్రియుడు చేతన్‌తో కొండ అంచు నుంచి కిందకు తోసేసినట్టు పోలీసులు ఆరోపిస్తున్నారు.



## 'ఇడుపు కాయితం'

ఇడుపు కాయితం ట్రోలింగ్ గురించి టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పందించారు. ఇడుపు కాయితం అర్థం పవన్ కళ్యాణ్‌కు బాగా తెలుసని.. అర్థం తెలియని వాళ్లు ఆయనను అడిగి తెలుసుకోవాలంటూ ఎద్దేవా చేశారు. "ఇడుపు కాయితం" ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో విస్తృతంగా వినిపిస్తున్న పేరు. ఈ పేరుపై వస్తున్న ట్రోల్స్, కామెంట్లు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇడుపు కాయితం అంటే అర్థం ఏమిటంటూ జరుగుతున్న ట్రోలింగ్ మీద తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. ఇడుపు కాయితం అర్థం తెలియాలంటే ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను అడగాలంటూ సెటైర్లు వేశారు. పవన్ కళ్యాణ్‌కు ఇడుపు కాయితం అర్థం బాగా తెలుసని.. ఆయనైతే కరెక్టుగా చెప్తారని ఎద్దేవా చేశారు. "ఇడుపు కాయితమంటే ఏందో అర్థమైతలేదంట. దాని మీద ట్రోలింగ్ చేస్తున్నారు. నేను ఒకటే మాట చెప్తున్నా. ఇడుపు కాయితమంటే అర్థం కాలేదని మాట్లాడుతున్నవారు.. పవన్ కళ్యాణ్‌ను అడగాలి. ఆయనకు దానర్థం బాగా తెలుసు. కచ్చితంగా మీకు చెప్తాడు. మా భాష మీద అవహేళన చేసినందుకే రాష్ట్రం వచ్చింది. ఇంకోసారి అలాంటి వెకిలి ప్రయత్నం చేయొద్దు. ఒకరి భాషను ఒకరం గౌరవించుకుందాం.. ఒకరి సంస్కృతిని ఒకరం గౌరవించుకుందాం.. అందరం కలిసి ఉందాం. అలా కాదని ఇలాంటి ప్రయత్నాలు చేసి తెలంగాణను, తెలంగాణ భాషను అవమానిస్తామంటే చూస్తూ ఊరుకోం. తెలంగాణ భాషను కించపరుస్తున్నా కాంగ్రెస్ పార్టీ ఏమీ మాట్లాడదు. ఎందుకంటే రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యమానికి సంబంధం లేదు. బీజేపీకి దేశంలోని అంశాలే తప్ప తెలంగాణ పట్టదు." అని కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ప్రియదర్శి, నాగదుర్గ హీరో హీరోయిన్లుగా 'ఇడుపు కాయితం' మూవీ షూటింగ్ గురువారం రోజున ప్రారంభమైంది. దొండపాటి వంశీరెడ్డి డైరెక్షన్‌లో ఇడుపు కాయితం ఫస్ట్ లుక్ గురువారం విడుదల చేశారు. అయితే 'ఇడుపు కాయితం' టైటిల్ బయటకు రాగానే దీని అర్థం ఏమిటి? అంటూ చాలామంది సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ పదం కావటంతో నేటి యువతకు దీనర్థం తెలియడం లేదు. అయితే ఇడుపు కాయితమంటే విడాకుల పత్రమని అర్థం. విడిపోవాలని నిర్ణయించుకున్న దంపతులు పెద్దల సమక్షంలో చేసుకునే ఒప్పంద పత్రాన్నే ఇడుపు కాయితం అని పిలుస్తారు. అయితే ఈ పదం మీద తెలంగాణ, ఆంధ్రాకు చెందిన కొంతమంది నెటిజన్ల మధ్యన సోషల్ మీడియాలో పెద్దఎత్తున చర్చ జరిగింది. దీంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్ అయ్యింది. అయితే పవన్ కళ్యాణ్‌కు ఇడుపు కాయితం అర్థం బాగా తెలుసంటూ కవిత చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఈ రకంగా పవన్ కళ్యాణ్ పెళ్లిళ్ల ప్రస్తావనను కవిత తీసుకువచ్చారని.. జనసేనానిని టార్గెట్ చేసుకున్నారని కొంతమంది నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# జర్నలిస్టులపై మూకదాడి ప్రజాస్వామ్యంపై దాడే..!




- దోషులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి
- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రాంరెడ్డి డిమాండ్

**జయభేరి, మేడిపల్లి, జూన్ 28 :**

సమాజానికి నిజాలను చేరవేస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయడం అత్యంత హేయమైన చర్య అని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రాంరెడ్డి తీవ్రంగా ఖండించారు. మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ అంబేద్కర్ నగర్‌లో జరిగిన ఘటనలో జర్నలిస్టు విష్ణుపై మూకుమ్మడిగా దాడి చేయడం, అతని ఇంటిపై రాళ్లు రువ్వడం, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం, వాహనాలను ధ్వంసం చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆదివారం మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో సీఐ జలంధర్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాలనీలో జరిగిన ఘర్షణకు సంబంధించిన దృశ్యాలను విధి నిర్వహణలో భాగంగా చిత్రీకరిస్తున్న జర్నలిస్టుపై దాడి చేయడం మీడియా స్వేచ్ఛను అణచివేసే ప్రయత్నమని అన్నారు. ప్రజలకు సమాచారం అందిస్తున్న విలేకరులను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడటం ఏ మాత్రం సహించబోమని హెచ్చరించారు.జరిగిన ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు జరిపి దాడికి పాల్పడిన ప్రతి ఒక్కరినీ గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని, కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల భద్రతకు పోలీసులు పూర్తి హామీ ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ముఖ్య సలహాదారులు కల్మూరి ఎల్లయ్య, వి. సూర్యనారాయణ రెడ్డి, అధ్యక్షుడు శ్రీదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి. సుందర్, కోశాధికారి మరాటి మల్లేష్, ఉపాధ్యక్షుడు చింత రమేష్, రాము యాదవ్, నాగరాజు, శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, భాస్కర్, మత్స్యగిరి, భగీరథ్ రెడ్డి, కమలాకర్, కుమారస్వామి, ప్రవీణ్, వెంకట్, ఉపేందర్, సిద్ధు తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.



# రెండో రోజుకు చేరిన రిలే దీక్ష

- **రెండో రోజుకు చేరిన యాదాద్రి పరిరక్షణ కమిటీ రిలే దీక్షలో దేవపూజ అశోక్, దండ్ల భానుచందర్,కర్రె శ్యామ్,శివరాత్రి వంశీ, పసుపునూటి మురళి, నందా ప్రవీణ్**

**జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 28 :**



యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో యాదగిరి గుట్ట కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేసి వాటిని వెంటనే టెండర్ వేయాలని కోరుతూ యాదగిరిగుట్ట పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభించిన రిలే నిరహర దీక్షలు ఆదివారం నాటికి రెండవ రోజుకు చేరుకుంది. పునర్నిర్మాణానికి సహకరిస్తే న్యాయమేది? ఈ సందర్భంగా పరిరక్షణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అతి తక్కువ కిరాయితో కొండపైన దుకాణాలు నిర్వహిస్తూ వాటిని పైరవీలతో రెన్యువల్ చేసుకుంటూ..కొత్త వారికి టెండర్లు వేసే అవకాశం ఇవ్వకుండా చేస్తున్న వర్తక సంఘాన్ని తక్షణమే రద్దు చేసి టెండర్లు వేయాలని కోరారు. గతంలో కేవలం 30,40 షాపులే ఉండేవి. ఇప్పుడు వాటిని 114 షాపులుగా పెంచారు. రాజకీయ,అధికార బలం తోటి ఇష్టం వచ్చిన విధంగా ఈ షాపులను కేటాయిస్తున్నారు. స్వామివారి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా వీళ్లు ఎటువంటి ఆస్తులు కోల్పోలేదు,స్వామి వారి కోసం ఎంతోమంది వారి ఇండ్లను భూములను కోల్పోయారు. బాధితులకు ఎటువంటి న్యాయం జరగలేదు. ఈ వర్తక సంఘం వల్ల దేవస్థానానికి,భక్తులకు నష్టమే తప్ప లాభం లేదు. కావున తక్షణమే వర్తక సంఘాన్ని రద్దుచేసి స్థానికులకు అందుబాటులో ఉండే విధంగా టెండర్లు వేయాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమ కార్యాచరణ పెద్ద ఎత్తున చేస్తామని కమిటీ సభ్యులు ప్రకటించారు.

**నిరహార దీక్షలో..**

ఆదివారం నిరహార దీక్షలో దేవపూజ అశోక్,దండ్ల భానుచందర్, కర్రె శ్యామ్, శివరాత్రి వంశీ, పసుపునూటి మురళి,సందా ప్రవీణ్, నిరహార దీక్షలకు మద్దతు ఇచ్చిన వారిలో కాటబత్తిని ఆంజనేయులు,మాటూరి బాలయ్య,మీర్యాల క్రిష్ణ, బండి అనిల్, కల్వకొలను సతీష్ భట్,ఆరె వెంకటేష్, పల్లపు రవి, పబ్బాల ఉప్పలయ్య,ఆరె రాంచందర్, దొమ్మాట ప్రభాకర్, కర్రె ప్రవీణ్,బుగ్గ ఆంజనేయులు,కొన్నె సంజీవ, ఎక్కలదేవి దినేష్, ఆవుల యాదగిరి,పద్దగంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.




# కొత్తగా అర్హులైన వారి ఓట్లను చేర్చాలి

**జయభేరి, సైదాపూర్ :**

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్ SIR ప్రక్రియలో భాగంగా గుజ్జులపల్లి గ్రామంలో పర్యవేక్షించడం జరిగినది. అర్హులైన ఓట్లను ఎట్టి పరిస్థితుల్లో తొలగించవద్దని అలాగే కొత్తగా అర్హులైన వారి ఓట్లను చేర్చాలని తెలియచేసినారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాదం శ్రావణి శ్రీనివాస్, సీనియర్ నాయకులు సహోదరు రెడ్డి, తిరుపతిరెడ్డి, సురేందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, సర్పంచ్ నమిండ్ల రవీందర్, బిఎల్ ఓ కొలిపాక కిషన్, బిఎల్ఎ చొప్పరిసాయికుమార్, మాజీ ఉపసర్పంచ్ బాషావేణి రవీందర్, మాజీ ఎంపిటిసి మేకల రవీందర్, కాంగ్రెస్ నాయకులు బావు తిరుపతి, చొప్పరి రవీందర్, కందుల మధుపాల్, చొప్పరి మహేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు ప్రతి ఓటరుకు కల్పించాలి



**జయభేరి, సైదాపూర్ :**

కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, మిట్టపల్లి కిష్టయ్య ఆకునూరు గ్రామంలో జరిగే SIR ప్రక్రియను పర్యవేక్షించారు. గ్రామంలోని BLO, BLA లు ప్రతి ఇంటికి వెళ్ళి ఓటర్ యొక్క వివరాలు సేకరించి ఓటు హక్కు ప్రతి ఓటరుకు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా నూతన మండల పార్టీ అధ్యక్షునిగా ఎంపికై మొదటి సారిగా గ్రామానికి వచ్చిన చాడ కొండల్ రెడ్డి గారిని పార్టీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో AMC డైరెక్టర్ మద్దూరి రజితరవీందర్ రెడ్డి, గ్రామశాఖ కాంగ్రెస్ అధ్యక్షులు జెల్ల శ్రీనివాస్, లింగారెడ్డి, గొల్లపల్లి సంపత్, మాధవరెడ్డి, పొడిశెట్టి సంపత్, BLO లు రజిత, రమ, BLA లు శ్రీవన్, కుమార్, ప్రదీప్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధ్యక్షునిగా ఎంపికైన చాడ కొండల్ రెడ్డికి ఘనంగా సన్మానం




**జయభేరి, సైదాపూర్ :**

కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్ గొల్లగూడెం గ్రామంలో జరిగే SIR ప్రక్రియను పర్యవేక్షించారు.18 సం,, నిండిన అర్హులైన ఓటర్లను ఎట్టిపరిస్థితుల్లోనూ తొలిగించకుండా చూడాల్సిన భాధ్యత పార్టీ కార్యకర్తల మీద ఉందని, ప్రజలు పార్టీ శ్రేణులు అధికారులకు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన మండల పార్టీ అధ్యక్షునిగా ఎంపికై మొదటి సారిగా గ్రామానికి వచ్చిన చాడ కొండల్ రెడ్డిని పార్టీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, AMC డైరెక్టర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మిట్టపల్లి కిష్టయ్య, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాకపోకలు సులభతరం

- **హుస్నాబాద్ నియోజకవర్గం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం లోని దుద్దెనపల్లి - కొత్తగట్టు రహదారి (10.90 కి.మీ) బలోపేతం కోసం రూ.9.57 కోట్ల రూపాయలు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) ద్వారా మంజూరు**



**జయభేరి, సైదాపూర్ :**

హుస్నాబాద్ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఈ మేరకు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM) ద్వారా మొత్తం 74.49 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి రూ.148.97 కోట్ల మంజూరు చేశారు. అందులో భాగంగా కరీంనగర్ జిల్లా వేసైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లికొత్తగట్టు రహదారి(10.90 కి.మీ) కోసం రూ.9.57 కోట్ల రూపాయల పనులు ఉన్నాయి. ఈ పనులు పూర్తయితే మండలంలోని ప్రజలకి కరీంనగర్వరంగల్ జిల్లాలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు వ్యవసాయ, వాణిజ్య, విద్య, వైద్య సేవలకు మెరుగైన అనుసంధానం ఏర్పడుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చాడ కొండల్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రహదారి అభివృద్ధికి 9.57 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




# రెండు చుక్కలు నిండు జీవితానికి వెలుగులు

- **చైర్ పర్సన్ శ్రీదేవి**
- **ఎల్లంపేట్ లో పల్స్ పోలియో కార్యక్రమం..**

**జయభేరి, మేడ్చల్ :**

"రెండు చుక్కలు నిండు జీవితానికి వెలుగులు" అని ఎల్లంపేట్ మున్సిపల్ చైర్పర్సన్ శ్రీదేవి రమేష్ నాయక్ పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాన్ని ఆమె సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ, దేశాన్ని పోలియో రహితంగా నిలబెట్టేందుకు ప్రతి తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో పల్స్ పోలియో కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు అర్చన శ్రీనివాస్ ముదిరాజ్, శ్రీలత రమేష్ యాదవ్, సెక్రటరీ రవీందర్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గౌరారం జగన్ గౌడ్, వైద్యులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొని పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# పల్స్ పోలియో చుక్కలు వేయించి చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడాలి

- **యాటవెల్లి హన్మంత్ రెడ్డి**



**జయభేరి, మేడ్చల్, జూన్ 29:**

మేడ్చల్ సర్కిల్ 298 డివిజన్ పరిధిలోని పూడూర్-కిష్టాపూర్ వార్డులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం పూడూర్లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో ఆదివారం ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ వార్డు సభ్యులు యాటవెల్లి హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ 298 డివిజన్ పరిధిలోని ప్రతి చిన్నారిని పల్స్ పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పోలియో చుక్కలు వేయించడం ద్వారా భవిష్యత్తులో చిన్నారులకు ఎలాంటి వైకల్యాలు రాకుండా పూర్తి ఆరోగ్యంతో ఎదిగే అవకాశాలు ఉంటాయని ఆయన తెలిపారు. చిన్నారుల ఆరోగ్యమే కుటుంబం, సమాజం మరియు దేశ భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని, తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఆయన కోరారు.

# పిల్లలందరికీ పోలియో చుక్కలు

- **ఉప్పల్‌లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**జయభేరి, ఉప్పల్ :**



ఉప్పల్ నియోజకవర్గంలోని ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (PHC)తో పాటు ఉప్పల్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనారాయణ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశాన్ని పోలియో రహితంగా నిలబెట్టడంలో ప్రతి తల్లి దండ్రి బాధ్యతగా తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించకుండా మిగిలిపోకూడదని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (DMHO) డాక్టర్ ఉమా గౌరీ మాట్లాడుతూ, పోలియో నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయించే కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

# నిబంధనల ప్రకారం నిర్వహించాలి

**జయభేరి, ఉప్పల్ :**



భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (SIR) కార్యక్రమంను ఉప్పల్ డివిజన్ పరిధిలోని లక్ష్మి నారాయణ కాలనీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (BLOలు), బూత్ లెవల్ ఏజెంట్లు (BLAలు)తో సమావేశమై కార్యక్రమం పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. నిజమైన అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఓటర్లందరికీ అవసరమైన SIR ప్రక్రియకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను అందజేసి, వాటిని సక్రమంగా నింపి సమయానికి సమర్పించేలా అవగాహన కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అధికారులు, పార్టీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో BLO లు BLA లు అధికారులు BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- **డిప్యూటీ కమిషనర్ సూదంష్**

**జయభేరి, మేడ్చల్, జూన్ 29:**



మేడ్చల్ సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సూదంష్ సూచించారు. ఆదివారం మేడ్చల్ సర్కిల్ పరిధిలో నిర్వహిస్తున్న ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన, ప్రజలకు అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సూదంష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవడం తప్పనిసరి అని తెలిపారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారు తమ వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు లేకపోవడం, పేరు, చిరునామా లేదా ఇతర వివరాల్లో మార్పులు ఉన్నట్లయితే ప్రత్యేక సవరణ కార్యక్రమం ద్వారా వాటిని సరిచేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రజలు సంబంధిత బూత్ లెవల్ అధికారులను (బీఎల్వోలు) సంప్రదించి అవసరమైన గుర్తింపు పత్రాలను సమర్పించాలని సూచించారు. ప్రజలు అపోహలు, సందేహాలకు లోనుకాకుండా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆయన కోరారు. ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు సాయి మాధురి, రాజబాబు, మాజీ కౌన్సిలర్ కౌడె మహేష్, బీఎల్వోలు, సిబ్బంది ఆఫ్రోజ్, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## స్వామి వారి కి ప్రత్యేక పూజలు

- యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కో-ఆపరేటీవ్ సంస్థ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య,రాష్ట్ర పెఱిక కులాల కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటేశ్వర్లు

**యాదగిరిగుట్ట, జూన్ 28:**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కోఆపరేటీవ్ సంస్థ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య,రాష్ట్ర పెఱిక కులాల కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కోఆపరేటీవ్ సంస్థ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య,రాష్ట్ర పెఱిక కులాల కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటేశ్వర్లుతో కలిసి యాదాద్రి క్షేత్రాన్ని దర్శించుకున్న సాంప్రదాయ బద్ధంగా ఆలయ అధికారులు,అర్చకులు స్వాగతించి ప్రత్యేక దర్శనం కల్పించగ స్వయంభు నరసింహ స్వామిని దర్శించుకున్న ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు లడ్డు ప్రసాదం జ్ఞాపికను అందజేశారు.

## పాముకుంట పాల సొసైటీ చైర్మన్ గా రంగ పాండు గౌడ్



**జయభేరి, రాజపేట, జూన్ 28:**

రాజపేట మండలంలోని పాముకుంట గ్రామంలో పాల ఉత్పత్తి దారుల సహాయక సహకార సంఘం చైర్మన్ గా మూడవసారి ఏకగ్రీవంగా రంగ పాండు గౌడ్ ఎన్నుకున్నారు. పాల సంఘం డైరెక్టర్లుగా బచ్చలి సాయిలు,గొడుగు అంజయ్య,భీమగాని సత్యనారాయణ,కాకల్ల నవీన్ కుమార్,దౌలపురం కనక లక్ష్మి డైరెక్టర్లు గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైతులు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి పొన్నబోయిన యాకూబ్,పాలకవర్గ సభ్యులు,రైతులు,సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి బీఎల్ఓ, బీఎల్ఏలు కీలకం

- సురేందర్ ముదిరాజ్



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ సర్కిల్ పరిధి గుండ్లపోచంపల్లి డివిజన్‌లోని గౌడవెల్లి గ్రామంలో కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గరిసెల సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా ముందుకు సాగాలంటే బీఎల్ఓలు, బీఎల్ఏల మధ్య సమన్వయం ఎంతో అవసరమని అన్నారు. ఓటర్ల వివరాలు గల్లంతు కాకుండా ఉండేందుకు బూత్ స్థాయి అధికారులు రూట్ మ్యాప్ ఆధారంగా పనిచేయాలని సూచించారు. అలాగే అధికారులు కోరిన గుర్తింపు పత్రాలను ప్రజలు సకాలంలో అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఇంటికి వచ్చే బీఎల్ఓలకు ప్రజలు పూర్తి సమాచారం అందించి, అవసరమైన పత్రాలను సమర్పించి ఎస్ఐఆర్ ప్రక్రియకు సహకరించాలని నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గువ్వ రవి ముదిరాజ్, గోమారం రమణారెడ్డి, డి గోపాల్, పాలకుర్తి మురళి గౌడ్, ఎల్ వినోద్ గౌడ్, ఎల్ రవీందర్ గౌడ్, రవితేజ, దాసరి గణేష్ యాదవ్ పాల్గొన్నారు.

## గోపన్ పల్లిలో చిన్నారులకు పోలియో చుక్కలు




**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం గోపన్ పల్లిలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హత గల చిన్నారులకు సంబంధిత సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాలలో కూడా పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో సిబ్బంది ఇంటింటికి తిరిగి వెళ్లి అర్హత గల చిన్నారులను గుర్తించారు. అలాగే వారికి పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్స్ పోలియోపై ప్రజలకు అవగాహన కల్పించారు. పల్స్ పోలియో కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ప్రజా ప్రతినిధులు, నాయకులు కోరారు.

# టైగర్ రిజర్వ్‌లో 42 పెద్ద పులులు

- విజయవంతంగా ముగిసిన అఖిలభారత పులుల అంచనా-2026
- మొత్తం 42 పెద్ద పులులు
- 18 ఆడ, 14 మగ,2 ఉప-వయోజన, 8 పిల్లలు గుర్తింపు
- 1,120 ప్రాంతాలలో 2,240 కెమెరా ట్రాప్
- 8 నెలలపాటు లెక్కింపు

**జయభేరి, దేవరకద్ర :**




ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో అఖిలభారత పులుల అంచనా 2026 విజయవంతంగా పూర్తయింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో అఖిలభారత పులుల అంచనా (ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ఏఐటిఇ)2026 కార్యక్రమం 2025 నవంబర్ నుండి 2026 జూన్ వరకు దాదాపు 8 నెలల పాటు విజయవంతంగా నిర్వహించారు. ఈ సర్వేలో మొత్తం 2,611 చ.కి.మీ. విస్తీర్ణంలో జరగడం విశేషం. సర్వేను క్రమబద్ధంగా నిర్వహించేందుకు రిజర్వ్‌ను 2 చ.కి.మీ గ్రిడ్‌లుగా విభజించారు. మొత్తం 1,120 ప్రాంతాల్లో 2,240 కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేశారు. ఈ సర్వేను నాలుగు బ్లాక్‌లుగా నిర్వహించగా, ప్రతి బ్లాక్‌లో కెమెరాలు 30 రోజుల పాటు పనిచేశాయి. ఈ కార్యక్రమాన్ని డా. సునీల్ ఎస్. హిరేమత్, ఐఎఫ్ఎస్ (ఫీల్డ్ డైరెక్టర్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్) రేవంత్ చంద్ర, ఐఎఫ్ ఎస్ (జిల్లా అటవీ అధికారి, నాగర్‌కర్నూల్) పర్యవేక్షించారు. ఫారెస్ట్ డివిజనల్ అధికారులు, రేంజ్ అధికారులు, ఫీల్డ్ సిబ్బంది, ఫ్రంట్‌లైన్ అటవీ సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు. అలాగే అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ జీవశాస్త్ర నిపుణులు మరియు హైటికోస్ బృందం సాంకేతిక, పరిశోధనా సహకారం అందించింది.

ఈ కెమెరా ట్రాప్ సర్వే జాతీయ పులుల అంచనా కార్యక్రమంలో కీలక భాగంగా నిలిచి, పులుల సంఖ్య, వాటి వ్యాప్తి, ఆహార జంతువుల సమృద్ధి, నివాస ప్రాంతాల పరిస్థితులపై శాస్త్రీయ సమాచారాన్ని సేకరించింది.ప్రాథమిక విశ్లేషణ ప్రకారం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో 18 ఆడ పులులు, 14 మగ పులులు 2 ఉపవయోజన పులులు 8 పులి పిల్లలు గుర్తించబడ్డాయి. దీంతో మొత్తం 42 పులులు నమోదు అయ్యాయి. పులి పిల్లలు, ఉపవయోజన పులుల ఉనికి, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో పులుల విజయవంతమైన సంతానోత్పత్తి కొనసాగుతోందని, ఆరోగ్యకరమైన పులుల జనాభా ఉందని సూచిస్తోంది. ఈ అఖిల భారత పులుల అంచనా-2026 విజయవంతంగా పూర్తికావడం అటవీ అధికారులు, ఫ్రంట్‌లైన్ సిబ్బంది, పరిశోధకులు, సంరక్షణ భాగస్వాముల సమిష్టి కృషికి నిదర్శనంగా నిలిచింది. ఇది అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో పులుల సంరక్షణ, శాస్త్రీయ వన్యప్రాణి పర్యవేక్షణను మరింత బలోపేతం చేస్తుంది.

## మ్యాగ్నెట్ పాఠశాల తీరుపై ఎస్ఎఫ్ఐ ఆగ్రహం

- పాఠశాలలోనే పుస్తకాల విక్రయం నిబంధనలకు విరుద్ధమని విమర్శ
- ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్
- విద్యను వ్యాపారంగా మార్చొద్దని హెచ్చరిక ... అధికారుల తక్షణ జోక్యం కోరిన ఎస్ఎఫ్ఐ



**జయభేరి, షాద్ నగర్, జూన్ 28 :**

షాద్‌నగర్ ప్రాంతంలోని మ్యాగ్నెట్ పాఠశాల యాజమాన్యంపై విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పాఠశాల ప్రాంగణంలోనే విద్యార్థులకు నోట్‌బుక్స్, టెక్స్ట్‌బుక్స్ విక్రయించడం ద్వారా విద్యను వ్యాపారంగా మార్చుతున్నారని ఎస్ఎఫ్ఐ డివిజన్ ఇన్‌చార్జ్ శ్రీకాంత్ ఆరోపించారు. పాఠశాలను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లోనే పుస్తకాల విక్రయాలు నిర్వహించడం తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపే చర్య అని విమర్శించారు. విద్యాసంస్థలు విద్యాబోధనకే పరిమితం కావాలని, వ్యాపార కార్యకలాపాలకు వేదికలుగా మారడం ఆందోళనకరమని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల అవసరాలను అవకాశంగా తీసుకుని లాభార్జనే లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను బేఖాతరు చేస్తున్నాయని శ్రీకాంత్ మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుతో వ్యాపారం చేయడం సమాజానికి మంచిది కాదని పేర్కొన్నారు.పాఠశాలల్లో పుస్తకాల విక్రయాలపై విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. తల్లిదండ్రులు కూడా తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా బలవంతపు కొనుగోళ్లకు గురైతే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సంఘం సూచించింది.అయితే ,ఎస్ఎఫ్ఐ చేసిన ఈ ఆరోపణలపై మ్యాగ్నెట్ పాఠశాల యాజమాన్యం నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.అధికారులు విచారణ అనంతరం వాస్తవ పరిస్థితులు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, రామ్ చరణ్, చరణ్ సుజనా వినోడే శ్రీకాంత్ ఆదిల్ సాయి శివ రామ్ చరణ్ నాని రాకేష్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసిన భాస్కర్ రెడ్డి

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం చిన్నరాజమూర్ లో ఆదివారం డిసిసి కార్యదర్శి ప్రేమ్ కుమార్ యాదవ్ కు చెందిన ఇంటి వాస్తు పూజా కార్యక్రమానికి దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోదరుడు జి.భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. అలాగే మ్యాదరి శీను ఇంటి వాస్తు పూజ కార్యక్రమానికి కూడా భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. అలాగే గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో కూడా భాస్కర్ రెడ్డి పాల్గొని ఇండ్ల లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తమ కుటుంబం తరపున ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నిరుపేదల అభ్యున్నతి కోసం ఇందిరమ్మ ఇండ్లకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టిందన్నారు. అంతేకాకుండా నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలన్నారు. అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్మన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

- షాద్‌నగర్ లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- షాద్‌నగర్ బస్ స్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారులకు పోలియో చుక్కలు



**జయభేరి, షాద్ నగర్, జూన్ 28 :**

జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని బస్ స్టాండ్ మరియు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పోలియో చుక్కలు వేశారు. ప్రతి చిన్నారికి పోలియో నిరోధక టీకా అందేలా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, డిప్యూటీ డిఎంహెచ్‌వో విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు పెంటయ్య మురళీమోహన్ అప్పి, సంతోషి భాయి చందులాల్, కొప్పునూరి ప్రవీణ్, రాజు నాయక్, బచ్చలి నరేష్, శివ ఎస్పీ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, సుజీవన్, సీనియర్ నాయకుడు చెంది తిరుపతి రెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, ముబారక్ అలీ ఖాన్, మాజీ జడ్పీటీసీ వెంకటరాం రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, ఉప్పరిగడ్డ గ్రామ సర్పంచ్ చందు నాయక్, నాగమణి, తంగడపల్లి శంకర్, మంగ అశోక్, జయప్రకాశ్, రవితేజ, నీరటి వాసు, షఫీద్దిన్, హెల్త్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## బుక్ స్టాల్స్ నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ లు,టై బెల్ట్ అమ్మకాలు
- ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి
- బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ

**జయభేరి, దేవరకొండ :**

బుక్ స్టాల్స్ నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి అని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం దేవరకొండ పట్టణంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ....... ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు,యూనిఫామ్ లు,టై బెల్ట్ లు అమ్ముతూ పేద విద్యార్థులను దోచుకుంటున్నారని ఆరోపించారు.అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని ఆయన కోరారు.ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి అని ఆయన కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్వీ మండల అధ్యక్షులు పాత్లవత్ లక్ష్మణ్,జామీర్ బాబా,పేట అభి, అంజనేయులు, వెంకటేష్ , మహేష్,రవి,తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి


- నిరుద్యోగులు తలుచుకుంటే ప్రభుత్వాలు కూలిపోయిన విషయం గుర్తుంచుకోవాలి
- ఖాళీగా ఉన్న 20,000 పోలీసు ఉద్యోగాలు, టీజీపీఎస్సీ గ్రూప్1,2,3,4 నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలి
- నిరుద్యోగులకు అండగా (టిఆర్ఎస్) తెలంగాణ రక్షణ సేన పార్టీ
- తెలంగాణ రక్షణ సేన షాద్ నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ "సీమల రమేష్ కురుమ"



**జయభేరి, షాద్ నగర్, జూన్ 28 :**

నిరుద్యోగుల పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి చూపిస్తుందని తెలంగాణ రక్షణ సేన షాద్ నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ సీమల రమేష్ కురుమ అన్నారు. ఆదివారం ఒక ప్రకటనలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీమల రమేష్ కురుమ మాట్లాడుతూ.... నిరుద్యోగులు తలుచుకుంటే పార్టీలు ఊసు లేకుండా పాతాలోనికి పోవడం ఖాయమని అది గత ప్రభుత్వంలోనే నిరుద్యోగులు నిరూపించారని రాష్ట్ర ప్రభుత్వానికి గుర్తు చేశారు.

# రజక, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ పథకం అమలుపై అనిశ్చితి



- బకాయిల భారంతో లాండ్రీ, సెలూన్ నిర్వాహకుల ఆందోళన

**జయభేరి, మేడ్చల్, జూన్ 28 :**

కులవృత్తులను ప్రోత్సహించేందుకు రజకులు, నాయీ బ్రాహ్మణులకు అమలు చేస్తున్న 250 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలుపై అనిశ్చితి నెలకొనడంతో లాండ్రీ, సెలూన్ షాపులు నిర్వహిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పథకానికి సంబంధించిన విద్యుత్ బిల్లుల బకాయిలను ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు సకాలంలో విడుదల చేయకపోవడంతో సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తుల అభివృద్ధి, ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో రజకులు, నాయీ బ్రాహ్మణులకు నెలకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని గతంలో ప్రకటించింది. ఈ మేరకు అప్పటి ప్రభుత్వం కొంతకాలం పాటు విద్యుత్ బిల్లుల మొత్తాన్ని విద్యుత్ సంస్థలకు చెల్లించిందని, అయితే అనంతర కాలంలో ఆ చెల్లింపులు నిలిచిపోవడంతో బకాయిలు పేరుకుపోయాయని వారు చెబుతున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఈ పథకం కింద విద్యుత్ సంస్థలకు ప్రభుత్వం కోట్ల రూపాయల మేర బకాయిలు చెల్లించాల్సి ఉందని సమాచారం. బిల్లుల చెల్లింపులు ఆలస్యం కావడంతో లాండ్రీలు, సెలూన్లు నిర్వహిస్తున్న రజకులు, నాయీ బ్రాహ్మణులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా అద్దె భవనాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. ఉచిత విద్యుత్ పథకం కింద ప్రభుత్వం చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో విద్యుత్ బకాయిలు లక్ష రూపాయలకు పైగా చేరుతున్నాయని, దీంతో షాపు యజమానులు ఆ మొత్తాలను తమే చెల్లించాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన పథకం ప్రయోజనం తమకు అందకపోగా, బిల్లుల భారం తమపై పడుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లాండ్రీలు, సెలూన్లు వంటి కులవృత్తి ఆధారిత ఉపాధి కేంద్రాలు ఇప్పటికే పెరుగుతున్న నిర్వహణ వ్యయాలు, అద్దెల భారం, ఇతర ఖర్చులతో సతమతమవుతున్నాయని, ఈ పరిస్థితుల్లో విద్యుత్ బిల్లుల సమస్య మరింత ఇబ్బందికరంగా మారిందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, ఉచిత విద్యుత్ పథకం అమలుపై సమగ్ర సమీక్ష నిర్వహించి, పెండింగ్ బకాయిలను విద్యుత్ సంస్థలకు వెంటనే విడుదల చేయాలని రజకులు, నాయీ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. అలాగే పథకం అమలులో స్పష్టత తీసుకువచ్చి, కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## దంతాలపల్లి మండలంలో పల్స్ పోలియో విజయవంతం

- వైద్యాధికారి డాక్టర్ కవిత

**జయభేరి, దంతాలపల్లి, జూన్ 28 :**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దంతాలపల్లి ఆధ్వర్యంలో 05 సంవత్సరాల పిల్లలకి దంతాలపల్లి మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన వైద్య సిబ్బంది పల్స్ పోలేను విజయవంతం చేయడం సంతోషకరమని మండల వైద్యాధికారి కవిత అన్నారు దంతాలపల్లి మండల కేంద్రంలో పంతం జాస్మిక మందన,కాన్సీ నందన్ కు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుత, దంతాలపల్లి మండలం లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పనితీరు అభినందనీయమని అనుచోట్ల బలస్పోలేని విజయంతో చేయడం సంతోషకరమైన విషయమని అన్నారు,నిండు జీవితానికి రెండే పోలియో ఎంతో ముఖ్యమని అన్నారు చుక్కలు అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలు కలిగిన తల్లిదండ్రులు తప్పకుండా తమ పిల్లలకి పోలియో చుక్కలు వేయించాలని సూచించడం జరిగినది. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సుజాత, కళావతి, సుభద్ర, పిల్లల తల్లిదండ్రులు పంతం ఉపేందర్, కుమారి తదితరులు పాల్గొన్నారు అంగన్వాడీ టీచర్స్ ఆశాలు పాల్గొనడం జరిగినది.

## చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న గ్రామ సర్పంచ్



**జయభేరి, గుడిపల్లి :**

మండల కేంద్రంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన స్థానిక సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ప్రియాంక బిఎల్ఓ అలివేలు ఆశ వర్కర్లు మాజీ వైస్ ఎంపీపీ ఆర్వెపల్లి సరిత నరసింహా వార్డు సభ్యులు ఎర్ర వంశీకృష్ణ కత్తుల రమేష్ హెల్తు అసిస్టెంట్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు జార్జి రెడ్డి



**జయభేరి, గుడిపల్లి :**

నల్లగొండ జిల్లా బహిరంగ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో జార్జి రెడ్డి PDSU నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి కళాచారిని గుడిపల్లి పోలీసులు ఆదివారం ఉదయం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కళాచారి మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను అణచివేయడం సాధ్యం కాదన్నారు. రాష్ట్రంలో విద్యారంగం తీవ్ర సమస్యలను ఎదుర్కొంటోందని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో అధ్యాపకుల కొరత, మౌలిక వసతుల లేమి, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంల పేరుతో దోపిడీ కొనసాగుతోందని ఆరోపించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అరెస్టులు ఉద్యమ స్ఫూర్తిని దెబ్బతీయలేవని, విద్యార్థుల హక్కుల కోసం జార్జి రెడ్డి PDSU పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## నిండు జీవితానికి పోలియో చుక్కలు




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు పల్స్ పోలియో కార్యక్రమాన్ని అధ్యక్షుడు NVT, 10 వ వార్డు కౌన్సిలర్ గుద్దేటి మాధవి సత్యం సభ్యులతో కలిసి చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు చుక్కలు ఎంతో అవసరమని, పల్స్ పోలియో అనేది పోలియో వైరస్‌కు వ్యతిరేకంగా ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలందరికీ టీకాలు వేయడం ద్వారా భారతదేశంలో పోలియో మైలిటిస్ (పోలియో) ను తొలగించడానికి భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రోగ నిరోధక ప్రచారం అని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. నూట పదిమంది వరకు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్ ,Dr ప్రజ్ఞ సాగర్, K పంతులాల్, భాస్కర్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ ఉమేష్ ,తాళ్ల సురేష్ ,సముద్రాల వెంకన్న, మాకం మహేష్, కౌన్సిలర్ సాయి చంద్ర గౌడ్ ,జగదీశ్వర చారి ,G సత్యం ,కరాటే మాస్టర్ గోపి, శ్రీను యాదవ్, నాగరాజు, బాలు, అఖిల్, జీవన్, రాములు ,మెడికల్ సిబ్బంది లింగయ్య, వినోద, సునీత ,బత్తుల సురేష్, రహీం, శివ ,రాము, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



## అబద్దాల హామీతో రాజకీయాలు తగవు

- నిరుద్యోగులు తలుచుకుంటే రాష్ట్ర ప్రభుత్వం కూలిపోవడం ఖాయం
- పల్లె విడిచి పట్టణంలో నిరుద్యోగులు పుస్తకాలతో కుస్తీ

**జయభేరి, షాద్ నగర్, జూన్ 28 :**

అబద్దాల హామీలతో ఏ రాజకీయ పార్టీ కూడా నిలవదని, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి సకాలంలో ఖాళీగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేస్తామని కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ పూర్తిగా విఫలమైందని, నిరుద్యోగుల పట్ల మొండి వైఖరి చూపడం రాష్ట్ర ప్రభుత్వానికి నష్టమని అన్నారు. ఆకలి కేకలతో తిండి తిప్పలు లేక ఒక పూట తిని ఒక పూట పస్తులు ఉండి హాస్టల్లో, స్టడీ హాల్లో విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడిన కష్టం వృధా కావడం జరుగుతుందని, తల్లిదండ్రులకు ఆర్థిక భారం అవుతుందని నిరుద్యోగులు ఎన్నో ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి వినదులు చేసిన పట్టించుకోవడంలేదని, ఇదే మొండి వైఖరి రాష్ట్ర ప్రభుత్వం వహిస్తే తమ పార్టీ చూస్తూ ఊరుకోదని నిరుద్యోగులకు అండగా (టిఆర్ఎస్) తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## గాంధీనగర్‌లో హెల్ప్ డెస్క్ ప్రారంభం

**నందానగర్‌లో పోలియో చుక్కల కేంద్రం సందర్శన**

**SIR కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి**



**జయభేరి, కుత్బుల్లాపూర్ :**

గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం నందానగర్‌లో నిర్వహిస్తున్న పోలియో చుక్కల కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేయించే కార్యక్రమాన్ని పరిశీలించారు. అలాగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంలో పాల్గొని ఓటరు నమోదు, సవరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. అదేవిధంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని, బీఎల్ఓలు అందించే ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా నింపి సమర్పించాలని కోరారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

# బిజేపి మేడ్చల్ జిల్లా మైనారిటీ మోర్చ అధ్యక్షురాలిగా రషీదా బేగం

- రాష్ట్ర బిజేపి పార్టీ కార్యాలయం నుండి రషీదా బేగంకు పిలుపు
- రషీదా బేగం పేరును ప్రకటన చేసిన మైనారిటీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు జగమోహన్ సింగ్
- రాంచందర్ రావు, ఈటెల రాజేందర్, జగమోహన్ సింగ్ కి కృతజ్ఞతలు - రషీదా
- ప్రధాని మోడి మా ముస్లిం మహిళలకు పెద్దన్నలా అండగా నిలపడ్డాడు
- నమ్మకంతో బాధ్యతిచ్చారు, పార్టీ బలోపేతానికి కృషి చేస్తా - రషీద బేగం.



**జయభేరి, కీసర సర్కిల్ :**

జి.హెచ్.ఎం.సి పరిధిలోని మల్కాజ్ గిరి జోన్, జవహర్ నగర్ కి చెందిన బి.ఆర్.ఎస్ నాయకురాలు సామాజిక కార్యకర్త, మాజీ వార్డు మెంబర్ సయ్యద్ రషీదా బేగం బిజేపి పార్టీలో చేరగా ఆమె చేసిన సామాజిక సేవలను రాష్ట్ర బిజేపి పార్టీ గుర్తించింది. మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ సమక్షంలో బిజేపి పార్టీలో చేరిన సయ్యద్ రషీదా బేగంకు రాష్ట్ర నాయకత్వం స్వాగతం పలికింది. రాష్ట్ర పార్టీ కార్యాలయం నుండి పిలుపు రావడంతో వెళ్లిన రషీదా బేగంకు మేడ్చల్ రూరల్ జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షురాలిగా బాధ్యతలు ప్రకటించారు. దీంతో తనను గుర్తించి తనపై నమ్మకంతో మైనారిటీ విభాగం అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎం.పి ఈటెల రాజేందర్ మరియు మైనారిటీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు జగమోహన్ సింగ్ కు రషీద బేగం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. బిజేపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ పార్టీ మతోన్మాద పార్టీ అంటూ ప్రచారం చేస్తారని అది వాస్తవం కాదని కేంద్ర ప్రభుత్వంలో బిజేపి ఇచ్చే అన్ని పథకాలు ప్రతి భారతీయుడికి అందుతున్నాయని అందులో మిగత వర్గాలతో పాటు ముస్లిం కూడా వున్నారని, ముస్లిం మహిళల పక్షాన ప్రధాన మంత్రి నరేంద్ర పెద్దన్నలా అండగా నిలపడ్డాడని ఈ సంధర్భంగా రషీద బేగం తెలియజేసారు.

# కాంగ్రెస్‌కు మరో షాక్

- పరకాలలో గులాబీ వైపు యువత అడుగులు
- ప్రభుత్వ వైఫల్యాలపై అసంతృప్తితో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ యువ నాయకులు.



**జయభేరి, పరకాల జూన్ 28:**

ఎన్నికల ముందు హామీలతో ప్రజలను ఆకట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో పూర్తిగా చేతులెత్తేసిందనే విమర్శలు రోజురోజుకూ బలపడుతున్నాయి. ప్రభుత్వ పనితీరుపై విసుగుచెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్ వైపు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో పరకాల మండలం వెంకటాపూర్ గ్రామ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు సిలివేరు భాను, యువ నాయకుడు కన్నం చిరంజీవి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, హామీలు గాలికొదిలి, పాలనను గందరగోళంగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆ అసంతృప్తే ఇప్పుడు పార్టీలోని నాయకులను కూడా బయటకు తీసుకొస్తోంది. ప్రజల ఆశలు నెరవేర్చే శక్తి బీఆర్ఎస్‌కే ఉందనే నమ్మకంతో యువత పెద్దఎత్తున గులాబీ జెండా వైపు వస్తున్నారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి




**జయభేరి, బోయిన్పల్లి, జూన్ 28 :**

హైదరాబాద్ బోయిన్పల్లిలో నిర్వహించిన "పల్స్ పోలియో" కార్యక్రమం మొదటి రోజు అత్యంత విజయవంతంగా ముగిసింది. మొదటి రోజు పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన మిగిలిన పిల్లల కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రెండు రోజుల పాటు వైద్య సిబ్బంది, వాలంటీర్లు, ఆశా కార్యకర్తలు,మరియు అంగన్వాడీ టీచర్లు కలిసి ఇంటింటికీ తిరుగుతారన్నారు. మొదటి రోజు రాలేకపోయిన ప్రతి ఒక్క చిన్నారిని గుర్తించి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులందరూ అలసత్వం వహించకుండా, తమ ఇంట్లో ఐదేళ్ల లోపు పిల్లలు ఉంటే రేపు, ఎల్లుండి వచ్చే సిబ్బంది ద్వారా తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పిల్లలను అంగవైకల్యం నుండి విముక్తులను చేయాలన్నారు. జరిగిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములైన ప్రజాప్రతినిధులకు, అధికారులకు, వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు, అంగన్వాడీ టీచర్లకు, వాలంటీర్లకు, సహకరించిన తల్లిదండ్రులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలను సన్మానించిన ఎమ్మెల్యే బాలు నాయక్

జయభేరి, దేవరకొండ :

నల్లగొండ జిల్లా కనగల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రూ.13,006 కోట్ల వ్యయంతో 6,092 కిలోమీటర్ల మేర 441 హ్యామ్ రోడ్ల అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తో పాటు రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని, రాష్ట్ర మంత్రులను శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. రూ.13,006 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన హ్యామ్ రోడ్ల ప్రాజెక్టు తెలంగాణ రవాణా రంగంలో చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 441 రహదారుల అభివృద్ధి ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానం మరింత బలోపేతం అవుతుందని, రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, సాధారణ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే కొనియాడారు. నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




## ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ భద్రతను వెంటనే పునరుద్ధరించాలి



జయభేరి, దేవరకొండ :

బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ భద్రతను తగ్గించడం ఆందోళన కలిగించే విషయమని బీఆర్ఎస్ యువజన నాయకులు షేక్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. 26 సంవత్సరాల పాటు ఐపీఎస్ అధికారిగా దేశానికి సేవలందించడంతో పాటు, గురుకుల విద్యాసంస్థల ద్వారా వేలాది మంది పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తికి భద్రతను తగ్గించడం సముచితం కాదని ఆయన అన్నారు. ప్రభుత్వ విధానాలు, ప్రజా సమస్యలపై డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిరంతరం తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఆయన భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. గతంలో తనకు ప్రాణహాని ఉందని ఆయన వెల్లడించిన విషయాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని, ప్రతిపక్ష నాయకుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని షేక్ ఇస్మాయిల్ అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించి, డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కి తగిన భద్రతను పునరుద్ధరించాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు



జయభేరి, చింతపల్లి :

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు సురక్షితమని తీదేడు గ్రామ మాజీ ఉప సర్పంచ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి అన్నారు.చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని పల్లె ధావఖాన వద్ద నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...05 సంవత్సరాల పిల్లలకి పోలియో చుక్కలు ప్రతి చిన్నారికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు భరోసా అని ఆయన పేర్కొన్నారు.పోలియో రహిత సమాజ నిర్మాణం మనందరి బాధ్యతని 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్యాన్ని కాపాడు కుందమని ఆయన తెలిపారు.ప్రతి తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని మనస్ఫూర్తిగా కోరుతున్నమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, వార్డు సభ్యులు మాదగోని కృష్ణగౌడ్,బిఆర్ఎస్ నాయకులు రాశిక శీరిష్,ఏం.యన్.యం లు ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోను ప్రారంభించిన కౌన్సిలర్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక 4వ వార్డులో బిజెపి కౌన్సిలర్ ఉమ రాజు ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉమరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అర్హత గల తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఖచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కేవలం రెండు పోలియో చుక్కలు.. పిల్లల జీవితానికి ఎంతో దోహదపడ తాయన్నారు.పోలియో చుక్కలు వేయడం వల్ల పోలియో నుండి పూర్తి రక్షణ లభిస్తుందన్నారు. అలాగే జీవితాంతం అంగవైకల్యం రాకుండా కాపాడుతుందన్నారు. పిల్లల ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు భరోసా, సురక్షితం, సులభం, ఉచితం ఈ పోలియో చుక్కలు అని ఆమె అన్నారు. పోలియో రహిత బావి భారత కోసం మనమంతా కలిసి కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్న వడ్డెమాన్ 'సర్' సర్వేలో సర్పంచ్ స్వప్న శివకుమార్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం చిన్నవాడ్డెమాన్ లో ఆదివారం నిర్వహించిన 'సర్' సర్వే స్థానిక సర్పంచి స్వప్న శివకుమార్ పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏ.వినోద్, గ్రామ అధ్యక్షుడు అమరేష్, తహసిల్దార్ ఎల్లప్ప, ఆర్ఐ తిరుపతయ్య, డి టి, బిఎల్ఓ ఉమాదేవి, డిఎల్ఏ దయానంద్, గ్రామ నాయకులు శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వప్న శివకుమార్ మాట్లాడుతూ 'సర్' సర్వేను బి ఎల్ వోలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. దీనికిగాను వారికి గ్రామస్తులు సహకరించాలని అన్ని కోరారు.

## విద్యార్థుల గొంతు నొక్కేందుకే ముందస్తు అరెస్టులా..?

- అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం
- ఏబీవీపీ తెలంగాణ రాష్ట హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్

జయభేరి, దేవరకొండ :



నల్గొండ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఎలాంటి నిరసన కార్యక్రమాన్ని ప్రకటించకపోయిన ముందస్తు అరెస్ట్ చేయడం విడ్డూరకరమని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో విద్యార్థి నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకోవాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. చట్టాన్ని గౌరవించే విద్యార్థి నాయకులపై ఇలాంటి చర్యలు తీసుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు.
ముందస్తు అరెస్టుల ద్వారా విద్యార్థుల గొంతును అణిచివేసే ప్రయత్నాలు మానుకోవాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ ప్రభుత్వం వ్యవహరించాలని అదేవిధంగా ఈ నల్లగొండ జిల్లాలో చూస్తున్నట్లయితే ప్రతి ఏటా 200 పై చిలుకు ప్రభుత్వ పాఠశాలలో మూతపడుతున్న ఈ విషయంపై విద్యా అధికారులు అదేవిధంగా రాజకీయ నాయకులు నోరు మెదపకుండా పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్న తరుణంలో వీటిపై ప్రశ్నిస్తున్న విద్యార్థి నాయకులపై అక్రమ కేసులు బనాయించి ఈ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వాలు నడుపుతున్న పరిస్థితి కొనసాగుతుంది. అదేవిధంగా దేవరకొండ నియోజకవర్గం గ్రామాల నుండి విద్యార్థులు ఉన్నత విద్య కోసం విద్యా సర్టిఫికెట్స్ ఔకతవకల కోసం జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే సుమారు 100 నుండి 120 కిలోమీటర్లు ప్రయాణం చేసే పరిస్థితి ఈ నల్లగొండ జిల్లాలో కొలువై ఉన్నది కావున సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా మీరు విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని కోరుతున్నాము అని వారు అన్నారు.

## పోలియో చుక్కలు చిన్నారుల ఆరోగ్య భవిష్యత్తుకు భరోసా

- సర్పంచ్ వట్టెం స్వప్న శివకుమార్

జయభేరి, దేవరకద్ర :



పోలియో చుక్కలు చిన్నారుల ఆరోగ్యకర భవిష్యత్తుకు భరోసా ఇస్తాయని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం చిన్న వడ్డెమాన్ సర్పంచ్ వట్టెం స్వప్న శివకుమార్ అన్నారు. చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు ఎంతగానో దోహదపడతాయని ఆమె అన్నారు.చిన్న వడ్డేమాన్ లో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ మాట్లాడారు. పోలియో చుక్కలు చిన్నారుల ఆరోగ్యకర భవిష్యత్తు కు భరోసా ఇస్తాయన్నారు. కావున ప్రతి చిన్నారికి ఖచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలనే ఆమె సూచించారు. చిన్నారులకు రెండు పోలియో చుక్కలు వేయించి పోలియోకు శాశ్వతంగా వీడ్కోలు పలుకుదామన్నారు. పోలియో రహిత భారత నిర్మాణంలో ప్రతి ఒక్కరం తమ వంతు బాధ్యతను నెరవేర్చుదామన్నారు.ఈ సందర్భంగా కొంత మంది చిన్నారులకు ఆమె పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆత్మకూరు వినోద్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అమరేష్ యూత్ అధ్యక్షులు ప్రదీప్, దయానంద్, ఏ రాజు, ఏ.శేఖర్, బెజినీ రాజు తదితరులు పాల్గొన్నారు.


## చిన్నారులకు పోలియో చుక్కలే జీవదార

- చిన్నారుల ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వద్దు మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్
- తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా

జయభేరి, జవహర్ నగర్ :



పిల్లల ఆరోగ్య భద్రత విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తలు కోరారు మల్కాజ్ గిరి జోనల్ కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ 8వ డివిజన్ లో గల అంగన్వాడి కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాసగుప్తలు హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్య భద్రత కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఐదు సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా సమీప పోలియో కేంద్రాలకు పిల్లలను తీసుకువెళ్లి పోలియో చుక్కలను వేయించి చిన్నారులు అనారోగ్యాల బారిన పడకుండా బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శారద ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు మనోధర్ రెడ్డి గజ్వేల్ శంకర్ భారతి హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది తో పాటు చిన్నారుల తల్లిదండ్రులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.





## మృతుడి కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక సహాయం

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం గురకొండలో ఆదివారం మృతుడి కుటుంబానికి సర్పంచ్ దాసరి చిన్నమ్మ ఉషనప్ప ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన గదం శ్రీను తండ్రి కిష్టన్న నడుచుకుంటూ వెళ్తూ కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ మృతుడి ఇంటికి వెళ్లి భార్య పిల్లలను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే జి.మనసుధన్ రెడ్డి (జిఎంఆర్) ఆదేశాల మేరకు మృతుడి కుటుంబ సభ్యులకు రూ.4వేల ఆర్థిక సహాయాన్ని సర్పంచ్ చిన్నమ్మ ఉషన్నప్ప అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, కుల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వీరప్పయ్య దేవస్థానం ఈఓగా శివానంద చారి

- కురుమూర్తి నుండి పదోన్నతిపై దేవరకద్ర కు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని, స్థానిక పట్టణ ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానం ఈఓగా శివానంద చారి పదవి బాధ్యతలు చేపట్టారు. జిల్లాలోని పేరెన్నిగన్న చిన్నచింతకుంట మండలం శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానంలో గత 20 ఏళ్లుగా శివానంద చారి సీనియర్ అసిస్టెంట్ గా పనిచేసి మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకున్నారు. అక్కడినుండి పదోన్నతి పై గ్రేడ్ 2 ఈఓగా దేవరకద్ర వీరప్పయ్య స్వామి దేవస్థానం ఈఓగా పదవీ బాధ్యతలు చేపట్టారు. దీంతో నూతనంగా వచ్చిన ఈఓకు పట్టణ ప్రజలు, భక్తులు ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈఓ శివానంద చారి మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానన్నారు. దీనికిగాను ప్రతి ఒక్కరూ తమకు సహకరించాలని ఆయన కోరారు.



# కళ్లు ఆరోగ్యంగా ఉండి కంటి చూపు మెరుగుపడాలంటే..

పూర్వం మనుషులకు వయస్సు మీద పడితేనే కంటి చూపు కాస్త మందగించేది. వృద్ధాప్యంలోనూ చాలా మందికి కంటి చూపు స్పష్టంగా ఉండేది. కానీ ఇప్పుడు అలా కాదు. చిన్న వయస్సులోనే చాలా మందికి కంటి చూపు మందగిస్తోంది. చిన్నారులు సైతం కళ్లద్దాలను ఉపయోగిస్తున్నారు. ఇందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. అయితే కంటి చూపు మందగించడానికి ప్రధానంగా మనం తీసుకునే ఆహారమే ముఖ్య కారణమని వైద్యులు అంటున్నారు. మనం తీసుకునే ఆహారాల వల్ల కంటి చూపు దెబ్బ తింటుందని వారు చెబుతున్నారు. అనారోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను ప్రస్తుతం చాలా మంది తింటున్నారు. వేపుళ్లు, ప్రాసెస్ చేయబడిన ఆహారాలు, మాంసం వంటి వాటిని అధికంగా తింటున్నారు. వీటిల్లో ఉండే అనారోగ్యకరమైన కొవ్వులు రక్త నాళాల్లో పేరుకుపోతాయి. ఇవి కళ్లకు రక్త సరఫరాను తగ్గిస్తాయి. దీని వల్ల కళ్లకు కావల్సిన పోషకాలు లభించవు. దీంతో కంటి చూపు మందగిస్తుంది. ఇలా మనం తీసుకునే ఆహారాలు కంటి చూపు లోపించేందుకు కారణమవుతున్నాయి.

### ఈ ఆహారాలు మానేయాలి..

వైట్ బ్రెడ్, పాస్తా, చక్కెర పానీయాలు, బేకరీ ఆహారాలను తీసుకుంటే షుగర్ లెవల్స్ అమాంతం పెరుగుతాయి. దీర్ఘకాలంలో షుగర్ లెవల్స్ అధికంగా ఉంటే కళ్లలో ఉండే రెటీనాలోని చిన్నపాటి రక్తనాళాలు దెబ్బ తింటాయి. దీని వల్ల డయాబెటిక్ రెటినోపతి వస్తుంది. దీంతో క్రమంగా కంటి చూపు మందగిస్తుంది. ఈ ఆహారాలు కూడా కంటి చూపు దెబ్బ తినేందుకు కారణం అవుతున్నాయి. ప్రస్తుతం చాలా మంది ఉప్పును కూడా అధికంగా తీసుకుంటున్నారు. దీని వల్ల బీపీ పెరిగితే కంటి రెటీనాపై ప్రభావం పడుతుంది. దీర్ఘకాలంలో ఇది కళ్లలో ద్రవాలు పేరుకుపోయేలా చేస్తుంది. దీని కారణంగా కళ్ల చుట్టూ వాపులకు గురవుతాయి. ఇది కూడా కంటి చూపుపై ప్రభావం చూపిస్తుంది. మద్యం అధికంగా సేవించే వారు తరచూ డీహైడ్రేషన్ బారిన పడుతుంటారు. దీని వల్ల కళ్లు తరచూ పొడిబారుతుంటాయి. దీర్ఘకాలంలో ఇది కంటి చూపు మందగించేందుకు, కళ్లలో శుక్లాలు ఏర్పడేందుకు కారణం అవుతుంది. పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కంటి చూపు మందగిస్తుంది.

### వీటిని తీసుకోవాలి..

కంటి చూపు పెరిగేలా చేసేందుకు కూడా మనం ఆహారాలపైనే ఎక్కువగా ఆధారపడాల్సి ఉంటుంది. ముఖ్యంగా విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. ఇవి కంటి సమస్యలను తగ్గిస్తాయి. కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి. పాలకూర, తోటకూర, పుదీనా, కొత్తిమీర వంటి ఆకుకూరలను ఆహారంలో భాగం చేసుకుంటే లుటీన్, జియాజాంతిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి.

ఇవి హానికర కిరణాల బారి నుంచి కళ్లను రక్షించడమే కాదు, కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి. కళ్లలో శుక్లాలు రాకుండా చూస్తాయి. కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. నారింజ, క్యారెట్లు, చిలగడ దుంపలు, గుమ్మడికాయలను ఆహారంలో భాగం చేసుకుంటున్నా కూడా ఎంతో మేలు జరుగుతుంది. వీటిల్లో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది. మన శరీరంలో విటమిన్ ఎ గా మారుతుంది. దీని వల్ల కంటి చూపు పెరుగుతుంది. ముఖ్యంగా కళ్లలోని కార్నియా సురక్షితంగా ఉంటుంది. రేచీకటి తగ్గుతుంది.

### ఇవి కూడా మేలు చేస్తాయి..

చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి కళ్ల రెటీనాను సంరక్షిస్తాయి. కళ్లు పొడిబారకుండా చూస్తాయి. కళ్లలో ఎప్పుడూ ద్రవాలు ఉండేలా చేస్తాయి. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను సైతం కలిగి ఉంటాయి. ఇవి కళ్లలో ఉండే రక్త నాళాలను సంరక్షిస్తాయి. ఆయా రక్త నాళాలు వాపులకు గురికాకుండా చూస్తాయి. దీంతో కళ్లు ఆరోగ్యంగా, సురక్షితంగా ఉంటాయి. బాదంపప్పు, వాల్ నట్స్, అవిసె గింజలలో విటమిన్ ఇ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. విటమిన్ ఇ వల్ల కళ్లలోని కణాలు సురక్షితంగా ఉంటాయి. కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. కంటి చూపు మెరుగు పడుతుంది. కళ్ల ఆరోగ్యానికి కోడిగుడ్లు, పప్పు దినుసులు, శనగలు వంటి ఆహారాలను కూడా తినవచ్చు. వీటిల్లో ఉండే ప్రోటీన్లు కళ్లను రక్షిస్తాయి. కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి. ఇలా పలు రకాల ఆహారాలను రోజూ తీసుకుంటూ ఉంటే కళ్లకు జరిగే నష్టాన్ని నివారించవచ్చు. కంటి చూపు మెరుగు పడి కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.



# ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలు శుభ్రం, ఆరోగ్యం

మన శరీరంలో ఎప్పటికప్పుడు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను కిడ్నీలు మూత్రం ద్వారా బయటకు పంపిస్తాయి. దీంతో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోకుండా ఉంటాయి. ఆరోగ్యంగా ఉంటాము. అయితే మనం పాటించే ఆహారపు అలవాట్లు, జీవనశైలి, దీర్ఘకాలిక వ్యాధులు, వాడే మందులు వంటి కారణాల వల్ల మన కిడ్నీల పనితీరు మందగిస్తుంది. దీంతో వ్యర్థాలను కిడ్నీలు సరిగ్గా బయటకు పంపలేకపోతాయి. దీని వల్ల దీర్ఘకాలంలో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇవి అనేక వ్యాధులను కలగజేస్తాయి. అందువల్ల కిడ్నీలను మనం ఆరోగ్యంగా ఉంచుకోవాలి. కిడ్నీలు ఎప్పటికప్పుడు వ్యర్థాలను బయటకు పంపిస్తూ శుభ్రంగా ఉండాలి. అప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటాం. అయితే పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. దీని వల్ల ఇతర వ్యాధులు రాకుండా కూడా అడ్డుకోవచ్చు.

### కొబ్బరినీళ్లు, యాపిల్ సైడర్ వెనిగర్..


కొబ్బరినీళ్లను రోజూ తాగడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. దీని వల్ల శిరోజాలు, చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కిడ్నీ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. కిడ్నీలు శుభ్రంగా మారుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్స్ కిడ్నీలను సురక్షితంగా ఉంచుతాయి. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి యాపిల్ సైడర్ వెనిగర్ కూడా పనిచేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఒక టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగుతుంటే కిడ్నీలు క్లీన్ అయి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గేందుకు కూడా ఇది ఎంతగానో పనిచేస్తుంది. షుగర్, కొలెస్ట్రాల్ స్థాయిలను సైతం అదుపులో ఉంచుతుంది. ఇక కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచేందుకు గాను పలు పండ్లు కూడా సహాయం చేస్తాయి. స్ట్రాబెర్రీలు, చెర్రీలు, యాపిల్స్, క్రాన్ బెర్రీలు, ద్రాక్ష, పైనాపిల్ వంటి పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది.

### ఈ ఆహారాలు కూడా అవసరమే..

అరటి పండ్లు, నారింజ పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలోని సోడియం స్థాయిలను తగ్గిస్తుంది. దీని వల్ల కిడ్నీలు శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కాలిఫ్లవర్, క్యాబేజీ, ఎరుపు రంగు క్యాప్సికం, ముల్లంగి వంటి కూరగాయలను తింటున్నా కూడా కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. కోడిగుడ్డు తెల్ల సొన, స్కిన్ లెస్ చికెన్, చేపలు, ఆలివ్ ఆయిల్, వెల్లుల్లి, ఉల్లిపాయలు వంటి ఆహారాలను కూడా తీసుకోవచ్చు. అయితే కిడ్నీలు ఎల్లప్పుడూ శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేందుకు గాను ఆహారంలో ఉప్పు తీసుకోవడం తగ్గించాలి. సోడియం తక్కువగా ఉండే ఆహారాలను తినాలి. మద్యం సేవించడం, పొగ తాగడం మానేయాలి. ఆకుకూరలు, కూరగాయలను, పండ్లను తినేందుకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. అలాగే రోజూ నీళ్లను తగిన మోతాదులో తాగాలి. ఇలా ఆహారపు అలవాట్లను పాటిస్తుంటే కిడ్నీలు శుభ్రంగా ఆరోగ్యంగా ఉంటాయి.

### బీట్ రూట్, నిమ్మరసం..

మనం బీట్‌రూట్‌ను అప్పుడప్పుడు తింటుంటాం. కానీ బీట్‌రూట్‌ను రోజువారి ఆహారంలో కచ్చితంగా భాగం చేసుకోవాలి. బీట్ రూట్‌లో పొటాషియం, నైట్రేట్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కిడ్నీలను శుభ్రం చేసి ఆరోగ్యంగా ఉంచుతాయి. రోజూ ఒక కప్పు బీట్ రూట్ ముక్కలను తింటుండాలి. లేదా ఒక కప్పు బీట్ రూట్ జ్యూస్‌ను అయినా తాగవచ్చు. దీని వల్ల కిడ్నీల ఆరోగ్యం మెరుగు పడుతుంది. కిడ్నీ వ్యాధులు రాకుండా ఉంటాయి. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి నిమ్మరసం కూడా ఎంతగానో పనిచేస్తుంది. నిమ్మరసంలో విటమిన్ సి ఉంటుంది. ఇది కిడ్నీలను శుభ్రం చేస్తుంది. కిడ్నీ స్టోన్లు ఏర్పడకుండా రక్షిస్తుంది. కిడ్నీల పనితీరు మెరుగు పడేలా చేస్తుంది. అదే విధంగా అల్లం రసం కూడా ఎంతగానో మేలు చేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే అల్లం రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.



# మీ జుట్టు వేగంగా.. బలంగా పెరగాలంటే...

**శరీరానికి పూర్తి ప్రొటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.**

**జుట్టు పెరుగుదలకు సూపర్ ఫుడ్స్:** జుట్టు వేగంగా పెరగడానికి పోషకాహారం ప్రత్యేక ప్రాముఖ్యత కలిగి ఉంది. సరైన ఆహారం లేకపోవడం, ఒత్తిడి, మారుతున్న జీవనశైలి కారణంగా జుట్టు రాలడం సమస్య వేగంగా పెరుగుతోంది. పరిశోధన ప్రకారం, మన జుట్టులో 90శాతం ప్రోటీన్ అంటే కెరాటిన్‌తో తయారవుతుంది. శరీరానికి పూర్తి ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.

1. **గుడ్డు** – గుడ్లలో ప్రోటీన్, బయోటిన్, జింక్ పుష్కలంగా ఉంటాయి. జుట్టు నిర్మాణానికి ప్రోటీన్ అవసరం. అంటే కెరాటిన్. బయోటిన్ జుట్టును బలపరుస్తుంది. దాని కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తుంది. జింక్ నెత్తిమీద చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.
2. **పాలకూర** – పాలకూరలో ఫోలేట్‌తో పాటు ఇనుము, విటమిన్ ఎ, సి ఉంటాయి. శరీరానికి ఆక్సిజన్ సరఫరా చేయడం ద్వారా ఇనుము జుట్టు మూలాలను బలపరుస్తుంది. విటమిన్ ఎ, సి తలపై సహజ నూనె అంటే సెబమ్ ఏర్పడటానికి సహాయపడతాయి. ఇది జుట్టు పొడిబారడాన్ని తగ్గిస్తుంది.
3. **బెర్రీలు** – స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్బెర్రీస్ వంటి బెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు కణాలను ఫ్రీరాడికల్ నష్టం నుండి రక్షిస్తాయి. జుట్టు విచ్ఛిన్నతను నిరోధించే కొల్లాజెన్‌ను నిర్మించడంలో సహాయపడతాయి.
4. **చేపలు** – సాల్మన్, సార్డిన్ వంటి చేపలలో ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ డి, ప్రోటీన్లు లభిస్తాయి.. ఇవి జుట్టు మూలాలను బలోపేతం చేస్తాయి. కొత్త జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తాయి. ఒమేగా3 జుట్టు పొడిగా మారడానికి అనుమతించదు.
5. **వాల్‌నట్స్** – వాల్‌నట్స్ ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ ఇ, బయోటిన్‌లకు చాలా మంచి మూలం. అవి జుట్టు కణాలలో వాపును తగ్గిస్తాయి. బలాన్ని పెంచుతాయి. బయోటిన్ జుట్టు రాలడాన్ని నివారిస్తుంది.
6. **క్యారెట్లు** – క్యారెట్లలో బీటాకెరోటిన్, విటమిన్ ఎ ఉంటాయి. ఇవి తల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. జుట్టుకు సహజమైన మెరుపును తెస్తాయి. విటమిన్ ఎ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు విరిగిపోకుండా, రాలకుండా నిరోధిస్తుంది.
7. **విత్తనాలు** – గుమ్మడికాయ, అవిసె, చియా వంటి విత్తనాలలో జింక్, ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ బి పుష్కలంగా ఉంటాయి. అవి జుట్టు ఆకృతిని మెరుగుపరుస్తాయి. కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తాయి.
8. **బీన్స్** – బీన్స్ వంటి ఆహారాలు అంటే కిడ్నీ బీన్స్, చిక్‌పీస్, బ్లాక్ ఐడ్ బఠానీలు ప్రోటీన్, ఐరన్, బయోటిన్‌తో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శాఖాహారులకు జుట్టుకు ఉత్తమమైన ఆహారాలు.
9. **చిలగడదుంప** – చిలగడదుంపలో బీటాకెరోటిన్ ఉంటుంది. ఇది శరీరంలో విటమిన్ ఎగా మారి జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తుంది. ఇది తల చర్మం సహజ తేమను కూడా నిర్వహిస్తుంది.

(*NOTE:* ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది)



